# అతిథిదేవుళ్ళొస్తున్నారు!

[ఆ ఉదయం సీతాపతి అతని అద్దె కొంపలో పక్కమీద పడుకొని బయటనుంచి వొస్తున్న మాటల్ని అతిశ్రద్ధగా వింటున్నాడు. బయట అతని భార్య పద్మ, బంధువుల్ని సాగనంపే ప్రయత్నంలో వున్నది. ఆ వైనం ముందు రాయడం రచయిత కర్తవ్యం—]

(బయటనుండి)

కామాక్షి: మరి వుంటానే పద్మా! పాపం మా గురించి చాలా శ్రమ పడిపోయేవ్. ముఖస్తుతి కాదనుకుంటే, ఈ నాలుగు రోజులూ మమ్మల్ని పూవుల్లో పెట్టుకున్నట్టు ఎంతో మర్యాదగా చూసేవు. చాలా థేంక్స అమ్మడూ. ఏవండోయ్... అన్ని సామాన్లూ వున్నాయేమో చూచుకోండి. తీరా ఇల్లు చేరుకున్న తర్వాత అదిలేదు, యిది మరిచిపోయామని ఆక్కడ చిందులు తొక్కితే నావల్లకాదు. అయ్యో ఏదేవిటండీ-చంటాడ్ని అల్లాగేనా ఎత్తుకోడం? సరిగ్గా ఎత్తుకోండి. ముగ్గురి పిల్లల తండ్రయినా యింకా పిల్లల్నెత్తుకోడవే సరిగ్గా రాదు ఖర్మం. ఏం మనుషులండి బాబూ!... అవునే పద్మా అన్నగారు లోపలే వున్నారా?

పద్మ: అవును! ఇంట్లోనే వున్నారు. వొంట్లో బాగోలేదుట. పిలవమన్నావా?

కా: అక్కర్లేదులే. ఇంక వెళ్ళొస్తాం. ఏవిటో, ఓకళ్ళాయిద్దరా? పిల్లామేకతో వొచ్చి నాలుగు రోజులున్నాం. ఎంత మంచి మనసే నీది! విసుగూ విరామం లేకుండా మా అందరికీ సేవలుచేసేవు. ఇవతలేమో, నీది కొత్త కాపురం. ఏవీ అనుకోవద్దే అమ్మడూ! ఏవిటో నిన్ను చూచి చాలా కాలమైందని చెప్పి వొచ్చేను.

ప: అలేదానివే... ఇందులో అనుకోడానికేముంది? ఒకళ్ళకొకళ్ళం పరాయి వాళ్ళమా ఏవన్నానా? బంధువులం. పైగా స్నేహితులం. నేను నీ యింటికీ, నువ్వు నా యింటికీ, రాక ఎవరిళ్ళకి పోతాం? అవ్వేమీ మనసులో వుంచుకోవద్దే కామాక్షీ. నాకొంచెం బాధగా వుంటుంది.

కా: మంచి మాటన్నావ్. ఏవండోయ్ విన్నారుగా... ఈ నాలుగు రోజులూ వెళ్ళిపోదాం. వెళ్ళిపోదామని ముళ్ళ మీద కూచున్నట్టు అన్నారుగా మా పద్మ పరాయి పిల్ల కాదంటేకాదు. అన్నగారి విషయమేమో తెలీదు గాని పద్మా! చాలామంది మగవాళ్ళంతా యిదే వరస. భార్యతరపు బంధువు లింటికి చుట్టం చూపుగా రావడ వంటే తగని సిగ్గు, చిరాకూను. మరిచేనే పద్మా! వొచ్చేనెల్లో మా తమ్ముడు...

[లోపల సీతాపతికీ, బయట రిక్షా వాడికీ ఓకే తడవ వొళ్ళు మండిపోయింది. రిక్షావాడు మాత్రం నోరు మూసుకొక్కుచోలేదు—]

రిక్షావాడు: ఏవమ్మో మీ పేరేవిటో తెలీదుగాని—

కా: కామాక్షమ్మంటారు బాబు.

రిక్షా: ఏ అమ్మైతే మాకేంటి. పొద్దున్నే బలేబేరం తల్లీ. వెళ్ళొస్తా, వెళ్ళొస్తానని గంటనుంచి చెబుతూనే వున్నావు, ఇట్టాగయితే అవతల మా బాడుగలేంగాను? వొచ్చి, రిక్షా ఎక్కు తల్లీ!..

కా: పాపం. రిక్షా అబ్బి తొందర పడుతున్నాడే పద్మా ఇక వుంటాం. వెళ్ళంగానే ఉత్తరం రాస్తాను. జవాబు యివ్వేం.. అయ్యయ్యో, అదేవిటండీ. ఆ చంటాడ్ని అల్లా నలిపిపారేస్తున్నారు. సరిగ్గా ఎత్తుకోండి. ఇంతకీ అన్ని శాల్తీలూ వున్నట్టేనా?

మొగుడు: మరిచాం.

కా: ఏవిటి?

మొ: మరచెంబు. కిటికీలో వుంచినట్టు జ్ఞాపకం.

కా: అయిందండీ. అనుకున్నంతా చేసేరు. విన్నావుగా పద్మా! అదీ విషయం. మర చెంబుట, మరిచిపోయారట.



ప: నేను వెళ్ళి పట్టుకొస్తాను గాని, నువ్వు

ముందు రిక్షా ఎక్కు.

[లోపల సీతాపతి విమానంలా పక్కగదిలోకి వెళ్ళి మరచెంబుతో తిరిగి వొచ్చేడు. పద్మావతి సీతాపతి చేతిలోని మరచెంబుని చూచి అన్నది]

ప: మంచిబాలుడు! ఈ విషయం చెబుతే మా కామాక్షికి మీకో సర్టిఫికేటిచ్చి వెడుతుంది చెప్పేదా సార్!

(మరచెంబుని పద్మ చేతుల్లోంచి అందుకుంటూ అన్నాడు.)

సీతాపతి: ముందీ చెంబుఇచ్చి వాళ్ళని పంపు. నాకేవిటో దడగావుంది. సర్టిఫికెట్ మాట దేవుడెరుగు. ముందిక్కడ్నుంచి కదులు.

[పద్మావతి నవ్వుకుంటూ బయటకెళ్ళింది. మరచెంబుని కామాక్షికి అందజేసింది.

(బయటనుండి)

కా: ఏవిటే అమ్మడూ మొగుడూ పెళ్ళాలిద్దరూ నవ్వుకుంటున్నారల్లేవుంది. మా వారి జ్ఞాపకశక్తి గురించేనా? అయ్యయ్యో... ఏవిటన్నాయనా? రిక్షానింత విసురుగా లాక్కుపోతున్నావ్... నీకేనబ్బీ ఏవిటా విసురు?

రిక్షా: ఇంక మాటాడకండమ్మా... అక్కడ లేటైపోతుంది.

[రిక్షాతోపాటు కామాక్షమ్మ కుటుంబం వెళ్ళిపోయింది. పద్మలోపలికి వొచ్చింది. సీతాపతి ఉస్సురంటూ కుర్చీలో కూర్చున్నాడు. పద్మ రావడం చూచి అడిగేడు.]

సీతా: వెళ్ళిపోయారంటావా?

ప: వెళ్ళిపోయారు... అంత అనుమానంగా అడుగుతున్నారే?

సీతా: అనుమానంకాదు. భయబడి చస్తూ అడిగేను. దుంప తెంచి వెళ్ళేరు అవును పద్మా, ఆవిడకదేం అలవాటు? అస్తమానం లొడలొడా మాట్లాడుతుంటే వినేవాడెంత అసహ్యించుకుంటాడో తెలుసా? పాపం- ఆ మహానుభావుడెలా భరిస్తున్నాడో గదా.

ప: మేం చదువుకునే రోజుల్లో ఇది యింత మాటకారి కాదండి.

## ఆవిష్కృ

సీతా: ఏమైతేనేం- మన కొత్త కాపురం అద్భుతమైన అనుభవంతో ప్రారంభమైంది. మహాతల్లి పచ్చటి పాదంతో— చూడు పద్మా ఈ యిల్లెంత మెరిసిపోతుందో! ఈ నాలుగురోజులూ తనూ సుఖపడిందికాదు, మనల్నీ సుఖపడనిచ్చిందిగాదు, నాలుగు రోజుల్లో వొరిగిపోయిందేవీ లేదనుకో - చెప్పద్దూ, ఆ తల్లితో ఈ నరమానవుడు కాపురం ఎల్లా నెట్టుకొస్తాడాని దిగులుగావుంది.

ప: మీరు విసుక్కుంటున్నారు గాని మనిషెంత మాటల పుట్టో అంత అభిమానవూ వుంది. తెలుసా?

సీ: ఇదిగో పిల్లా నువ్వు ఆవిడ అభిమానం సంగతి నా దగ్గరెత్తకు. వొళ్ళుమండిపోతోంది. (కొంచెంఆగి అన్నాడు) మన పెళ్ళయి రెండు సంవత్సరాలు - అవును సరిగ్గా రెండు సంవత్సరాలగ్గాని ఇక్కడ కాపురం ప్రారంభం కాలేదు. నువ్వక్కడ, నేనిక్కడగా రెండు సంవత్సరాలు సుఖంగా లేకుండా గడిచిపోయాయి. పెద్దవాళ్ళ ధర్మమా అని మనకి చాలా పండుగలున్నాయి. కనీసం ఆరోజుల్లోనయినా నీ దగ్గరుండే మహద్భాగ్యాన్ని నోచుకున్నాను. ఇక్కడ ప్రారంభం కాబోయే మన కొత్త కాపురం గురించి నీ కెన్నెన్ని ఉత్తరాలు రాసేనో... ఎన్నెన్ని ఊహించేనో సమీక్షించుకుంటే వొళ్ళు మండిపోదూమరి. జూలై పదిహేడున ఇల్లు కుదుర్చుకున్నాను. పందొమ్మిదిన ఈ ఇంటికి నువ్వొచ్చావ్. ఈ ఇంటో ఎంచక్కా నువ్వూ నేనూ. థేంక్ గాడ్ అనుకున్నాను. ఇవాళెంత ఇరవైరెండు. జూలై ట్వంటీ సెకండు. మీ కామాక్షమ్మగారు రాకుంటే మన కొత్త కాపురంలో ఈ నాలుగురోజులూ నేను జీవిత పర్యంతం మరిచేవాడినేకాదు, శుభమాని నువ్విఇంట్లో కాలుపెట్టిన సాయంత్రమే ఆవిడగారు మందీ మార్బలంతో వొచ్చేసింది. నా సుఖాన్నీ, నా ఆనందాన్నీ పూర్తిగా తినేసి వెళ్ళిపోయింది. ఈ నాలుగు రోజుల్లో నువ్వూ నేనూ ఏకాంతంగా కూచుని పది నిమిషాల పాటు మాటాడుకున్న భాగ్యం నీ కేమైనా గుర్తుంటే చెప్పు. విని సంతోషిస్తాను. అభిమానంట! అభిమానం! పొద్దస్తమానం ఆవిడ పిల్లల్నెత్తుకుని గడిపాన్నేను. ఆ మహానుభావుడు- పేరుగూడా మరిచేను. ఆయనేమో మొద్దబ్బాయిలా నిద్రమొహంతో జోగడంతో సరిపుచ్చుకున్నాడు. ఎంచక్కా నువ్వు, ఆ కామాక్షమ్మగారూ ఖాతాఖానీలో మమ్మల్ని పూర్తిగా మరిచిపోయేరు. అభిమానంట, అభిమానం... ఆవిడికి నీ మీదింత అభిమానం మమకారంలాటి పదార్థాలేవైనా వుండివుంటే మన కొత్తకాపురంలోకి అడుగు పెట్టనే పెట్టకూడదు. అది రూల్. ఒప్పుకో.

ప: నే నొప్పుకోను.

సీ: ఎంచేత?

ప: కామాక్షి మనకి దగ్గర్లో లేదు, ఎక్కడో ఖరగ్‌పూర్‌లో వుంటుంది. వాళ్ళాయనకి ఏడాదికి మాటు దొరికే సెలవు ఎంత జాగ్రత్తగా వాడుకోవాలో తెలిసిన మనిషి. మన దగ్గర నాలుగు రోజులే వుంది. లేకపోతే –

సీ: లేకపోతే నాలుగు నెలలు తిష్ఠ వేసేంటావ్. అంతేగా.

ప: అప్పుడు బాగానే వుండేది. వుంటే ఏం? తప్పా?

సీ: తప్పెందుకవుతుంది పద్మా! మూడో నెల దాటకుండానే మంచి ముహూర్తం చూచుకుని ఈ సీతాపతిగాడు 'జై సీతారాం' అని చోటు మార్చేవాడు. అప్పుడు అమ్మగారికి తిక్కొదిలి పోయేది.

ప: బెదిరిస్తున్నారా? ఇంతకీ, అంతకీ బెదిరిపోయే అమ్మాయిని కాదు.

సీ: అవునది తెలుస్తూనే వుందిగా. ఇంట్లో మొగుడంటూ ఒకడున్నాడు. వాడి కేవో చిల్లరమల్లర కలలు కొన్ని వున్నాయి. నాలుగురోజులూ వాడు విషాదగీతాలు పాడుకుంటే ఏం ధర్మమనే యిద్దైనా లేకుండా ఆ కామాక్షమ్మ గారితో ముచ్చట్లాడుకున్న నీకు మొగుడు సన్యాసం స్వీకరిస్తున్నాడంటే ఒక లెక్కా, జమా? పద్మా – నాకు మండుకొస్తుంది. ఇంకేం మాటాడకు.

ప: నాకూ అలాగే వుంది ఇంకేం మాటాడకండి.

సీ: ఇంకేం, ఈ నాలుగురోజుల్లో ఆ కామాక్షమ్మ గారు విద్యలన్నీ నేర్పి వెళ్ళిందన్నమాట. ఆవిడ వాళ్ళాయన మహాశయుడ్ని ఎంతలో వుంచి సంసారం చేస్తుందో ఇందాక ఆ రిక్షావాడు సైతం గమనించే వుంటాడు. ఏమనుకుంటున్నావో ఏమో, ఆ ఆటలు ఈ యింట్లో చెల్లవు గాక చెల్లదు.

ప: అవును... ఇంక మీ దగ్గర నేర్చుకోవాలి నేను. బంధువుల్ని గుమ్మంవరకైనా సాగనంపాలనే కనీస మర్యాదని మరచిన మనిషి మీరు. చెప్పండి మీ పాఠాలు నేర్చుకుంటాను.

సీ: (కోపమొచ్చింది) ఏయ్!

ప: (అలాగే అంది) ఓయ్!

సీ. (ఎగాదిగా చూచి అన్నాడు) ఇంక మాటాడకు... వెళ్ళు ...కొంచెం కాఫీ ఉంటే తగలెట్టు. ఉద్ధరించింది మహా...

ప. లోపల ఫ్లాస్కులో కాచిపోసింది కొంచెం మిగిలి వుంది. కావాలనుకుంటే వెళ్ళి తాగండి.

సీ. అంటే ఏవిఁటి నీ చేతుల్తో యివ్వవ్. అదేగా అర్థం.

ప. మీకు చాలా అర్థాలు తెలుసు. ఇక నన్ను వేరే అడగడమెందుకు?

సీ. (నెమ్మదిగా అన్నాడు) ఆల్ రైట్ (గట్టిగా అరిచేడు) ఆల్ రైట్ (కొంచెమాగి నెమ్మదిగా అన్నాడు) పద్మా – (తనవేపు పద్మ చూచినపుడు మండిపోయి మళ్ళా గట్టిగా అరిచేడు) ఆల్ రైట్. నాకు చేతుల్లేవనుకున్నావా? నేనే తాగుతాను. (వెళ్ళి ఫ్లాస్కు తెచ్చుకుని కాఫీ వొంచుకున్నాడు. తాగి అన్నాడు) ఛీ... విషం!

ప. విషమా?

సీ. కాకపోతే, ఏవిఁటిది కాఫీనా?

ప. నేను మాత్రం కాఫీ అని ఎల్లా అంటాను? ఇంతకు ముందే దీన్ని అమృతమని పేరుపెట్టారు, నా వంటా వార్పుని వాళ్ళందరిముందూ గొప్పగామెచ్చుకొన్నారు.


సీ. మెచ్చుకోక ఏం చేయమంటావ్? ఎవరో పరాయి వాళ్ళకి నా దౌర్భాగ్యాన్ని చెప్పుకోమంటావా?

ప. నేను చేసిన కాఫీ తాగడమేఁ దౌర్భాగ్యమా? అయితే ఇకనుంచి ఈ యింటో వంట చేయన్లెండి. ఎంచక్కా హొటల్నుంచి తెప్పించుకు తినండి.

సీతా. (నిర్లక్ష్యంగా అన్నాడు) ఏం భయపడతాననుకున్నావా? డబ్బునలా పారేసి హొటల్నుంచే తెప్పించుకు తింటాను. ఇన్నేళ్ళూ నేనా హొటల్ తిండితో బతకలేదా? ఇక తినబోయి బతకలేనా? ఏవిఁటో అనుకుంటున్నావల్లేవుంది. అయ్యరుకి నేనంటే ఎంతిష్టమో తెలుసా? కాపురం పెట్టబోతున్నాను అయ్యరూ నీకూ నాకూ బంధుత్వం తీరిపోతుందని చెప్పిన్నాడు నువ్వు చూళ్లేదుగాని భోళ్ళున ఏడ్చేడు ఫూల్! అయ్యో సావీఁ మీలాటి కష్టమర్ని నమ్ముకునేగదా ఆ కిచెన్ గదికి రిపేరు మొదలెట్టేను. ఇప్పుడింత అర్జంటుగా వెళ్ళిపోతే ఎలాగ సావీఁ అని గోలపెట్టేడు. మా అనుబంధం అంత గొప్పది. నా కెలాటి కూరలు ఎంతెంత యిష్టమో ఈ భూమ్మీద మా అమ్మతర్వాత వాడికే తెలుసు. ఒకటా రెండా, ఏడేళ్ళ అనుబంధం. నేనిక్కడ చదువుకున్నన్నాళ్ళూ అయ్యరే వండిపెట్టేడు. అప్పుడు ఆ హొటలు పెంకుటిల్లు. ఇక్కడే ఉద్యోగంవొచ్చింది. అదే హొటలు – డాబాకి పెరిగింది హోదా. పెళ్ళి చేసుకుని వంటరిగా వున్నాను. సేమ్ హొటల్ విత్ సమ్ మోడిఫికేషన్స్ ఎండ్ ఎక్స్‌టెన్షన్స్. నువ్వివాళ కాపురానికొచ్చి మళ్ళీ అదే హొటల్‌కి వెళ్ళమంటున్నావ్. పర్లేదు పద్మా, నాకు కేరియర్ పంపు అయ్యరూ అని చెప్పాలేగాని, రథమ్మొకటి మాటాడి నన్ను ఈవూరు వూరంతా – మెళ్లో దండేసి – తిప్పగలడు.

ప. (ఇంత విన్నతర్వాత పద్మ పకపకా నవ్వేసింది)

సీతా. ఎందుకట్లా నవ్వుతావ్? వేళాకోళంగా వుందా?



ప. మధ్య వేళా కోళమెందుకు? ఒక ఆలోచన వొచ్చి నవ్వే సేను.

సీతా. ఎవిఁటో అది ?

ప. మీా ఖర్మ కొద్దీ నన్ను పెళ్ళాడేరు గానీ, ఆ అయ్యర్నే పెళ్లాడివుంటే బాగుండిపో ది. కోరిన వంటలు కోరిన విధంగా చేసేవాడు.

సీతా. నోర్మూయ్. ఆడదానికి అలుసివ్వ కూడదని మా భగవాన్లు అనేవాడు. ఎక్కడున్నాడోగాని — వెధవ — వాడన్నది అక్షరాలా నిజం. నీతో నేను ంచెం కరుకుగా వుండి వుంటే ఈ కామాక్షమ్మలూ. సీతారావమ్మలూ నా యిష్టంలేకండా యిక్కడికి వొ వారూకాదూ, వచ్చి నాలుగురోజులు తిష్ఠవేసెవారూ కాదు. నీ అగడాలు, నా సేవలూ నాన్‌సేన్స్. ఒ త్రితక్కువతనం నాది. ఒరేయ్ భగవాన్లూ...

(సరిగ్గా అప్పుడే వొచ్చేడు భగవాన్లు)

భగవాన్లు. ఎరా, పిలిచేవా ?

(ఈ హఠాత్పరిమాణానికి సీ ాపతీ, పద్మావతీ ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. ీ ాపతి ఆశ్చర్యపోతూ పలకరించేడు)

సీతా. ఒరేయ్...ఒరేయ్...నువ్వు...

భగ. పిలిచేవా అంటున్నాను.

సీతా. ఎవిఁట్రా యిది ? ఎవిటీ వింత ాక్షాత్కారం ?

భగ. పిలిచేవా అంటున్నాను.

సీతా. లేదురాబాబు, ఇప్పుడే తల్చుకున్నాను. ఎక్కడ్నుంచే విటి ?

భగ. పిలిచేవా అంటున్నాను.

సీతా. ఛ... వెధవ... నాలుక తెగ్గోస్తా . వెధవ సంధివాగుడూ నువ్వూను. ఒసేయ్ పద్మా, నే చెప్పేనే భగవాన్లని. వాడేవీడు.

ప, తెలుస్తూనేవుంది. నమస్కారమండి.

భగ. ఒరేయ్ సీతాపతీ! నన్ను పిలవలేదుట్రా ?

సీతా. అవున్లేరా, పిలిచేనే అనుకో. ఏ వూరునుంచి రావడం?

భగ. కాకినాడ నుంచి.

సీతా. ఏవిఁటి విశేషం ?

భగ. విశేషమేరా, చాలా పెద్ద విశేషం!

ప. (సీతాపతిని దెబ్బతీయాలనుకుంది) ఎన్నాళ్లుంటారు ?

సీతా. (నొచ్చుకున్నాడు) పద్మా!

భగ. అదేంమాట పద్మగారూ! నేనూ, మీారూ, మన సీతాపతిగారూ మనమంతా ఎన్నాళ్లుంటాం ? ఎవరు శాశ్వతం ? కొంచెం వెనకా ముందూ తేడాల్లో అందరం ఒకటే. అంతేగదరా సీతాపతీ!

సీతా. పద్మ అడిగిందది కాదురా. నువ్వు మాయింటికొచ్చేవు గదూ, ఈ యింట్లో ఎన్నాళ్ళుంటావని ? (ఎగతాళిగా అన్నాడు) ఇప్పుడే నువ్వొచ్చేముందు, నాలుగురోజులు ఈ యింట్లో స్టే చేసిన బేచ్ — పెద్ద బెటాలియనొకటి వెళ్ళిపోయిందిలే. అందుచేత...

భగ. ఇవాళ తప్పదు. రేపటి విషయం చెప్పలేను. బాబ్బాబు పొమ్మనుకురా సీతాపతీ!

సీతా. మరేం ఫర్లేదురా భగవాన్లూ. నీ యిష్టమొచ్చినన్నాళ్లు హాయిగా నిక్షేపంగా యిక్కడే వుండు. నా ప్రాణమిత్రుడివి. రాకరాక — అభిమానం వల్లనేగా — నన్ను వెతుక్కుంటూ నా యింటికొచ్చేవు. అంతకంటే నాక్కావల్సిందేముంది ? అడ్డమైనవాళ్ళకి మా యిల్లు ధర్మసత్రంరా భగవాన్లూ!

భగ. అడ్డమైన వాళ్ళంటున్నావు — నేనూ ఆ క్లాసే నేమిట్రా!

సీతా. ఛ...ఎవడామాటన్నది ? నువ్వు అ క్లాసువాడివెందుకవుతావురా ? నువ్వు మందీ మార్బలంతో వొచ్చేవా ఏవన్నానా ? చేతిలో సూటుకేసైనా లేదు. ఎంత సింపుల్‌గా వొచ్చేవురా ఫ్రండూ! గెస్టంటే ఇదిగో ఇల్లా వుండాలి.

ప. (బాధపడింది) ఆకాడికి మాకామాక్షి మందీమార్బలంతో వొచ్చిందనేగా మీా అభిప్రాయం ?

భత. కామాక్షి ఎవర్రా ? మీనాక్షి సిస్టరా ? అవునొరేయ్ మీనాక్షి అమెరికా వెళ్లిపోయిందిట తెలుసా! హ్యాలక్కీ

సీతా. నీదో పాడుగోల. మాటందుకోడవేం మహాపాపం చెకచెకా వెళ్లిపోతావ్. కామాక్షని మా ఆవిడకి ఫ్రండు... నాలుగు రోజుల క్రితమే ఈ ఇంట్లోకొచ్చేం.

భగ. విన్నాను. ఇందాక చైనులుగాడు అంతా చెప్పేడు. చాలాకాలానికి ఒకమంచిపని చేసేవురా అబ్బాయ్. చాలా సంతోషం. అసలు నా విజిటింగ్ మన చైనులుగాడి రూమే అనుకో. కాని, వాడి రూమ్మేటు కేవ్లంగొడ్డు. ఎటికసీ బొత్తిగా తెలీదు. అంచేత, చైనులు నీ అడ్రసిచ్చేడు. రోడ్లూ, పార్కు బెంచీలు, రైల్వేస్టే

సీతా - వీటి మొహమెవడ చూస్తాడింక. నీ యిల్లున్న చోటు. ఆమాత్రం ప్రైవేసీ యిక్కడ దొరకదానిచెప్పి తిన్నగా యిక్కడికొచ్చేసేన బాగుందికదూ!

ప. మంచిమాటన్నారు. లేకపో చూడండి, ఈ యింటిని పట్టుకుని ధర్మసత్ర మంటున్నా రాయన. ఇది ధర్మసత్రమా? ఎంతమాత్రంకాదు. ఒకరో , పార్కులోబెంచి, రైల్వే స్టేషను. బాగా బుద్ధిచెప్పే.

సీతా. (కోపం వొచ్చింది. వేడెకి పోయి అన్నాడు) భగవాన్లూ! నువ్వు ఆ అభి యంతోనే కూసేవుట్రా! నిజంచెప్పు వెధవా! నా యి ు రోడ్డుట్రా! పార్కులో బెంచీనా! రైల్వేస్టేషనా! చె ్రా!

భగ. చూస్తుంటే మీ యిద్దరి వరసా ఏ కారణంగానో వికటించినట్టుందే...

సీతా. మా యింటి గురించి అంత ప్ అభిప్రాయం వుంటే, వెంటనే గెటవుట్.

భగ. రామరామ... నేనా అభిప్ర యంతో ఎందుకంటాన్రా. నోరు జారిందిగాని నా అభి ాయం అదికాదురాబాబు. అయినా ఒరేయ్ సీతాపతీ! ది ఇల్లుట్రా! ఎంతమాత్రం కాదు. నెంబరు వన్ ఇంద్ర వనం. ఎంత చక్కటిల్లురా. అబ్బ... ఎంత ముచ్చటగా ందనీ. ఎవడ్రా ఈ ఇల్లు కట్టేడు? వాడి స్కిల్ కిచ్చే యవచ్చు ఇటుకొక్కక లక్ష చొప్పున. ఎంతరా అద్దె!

సీతా. నూటిరవై.

భగ. అయితేనేం, నిక్షేపంగావు ది. లక్షణంగా వుంది. నీ యిల్లుని చూస్తుంటే నాకి డ్నుంచి కదల బుద్ధవడం లేదురా... /

ప. (నిష్ఠూరంగా అన్నది) మీ కదులుతారంటే నేనెలా నమ్మతాను!

భగ. అమ్మా! నావల్ల మీకేం ుబ్బంది వుండదు. పిల్లా పాపా, గాడిదమేకా లే వాడిని, చాలా పెద్దపని మీదొచ్చేను, ఏదో, ఆ ికాస్తా శుభమనిపించుకుని నా దారిని నేను పోతాను.

సీతా. ఎందుకురా యిప్పుడా అపా జీలు! నేనీ యంటి యజమానిని. నువ్వు నాచేత సే ు చేయించుకునే నిమిత్తం రాలేదు. నీకు అడ్డమైన చ కిరీ చేసి మేము ఏమాత్రం అలిసిపోనక్కరలేదు. వెల్ దిచాలు.

భగ. మాటకుముందు అడ్డమైన డ్డమైన అని విసుక్కుంటున్నావ్, ఒరేయ్ సీతాపతీ! ళ్లిపోయిన బేచ్ ఆబాపతు మనుషులనేది నిజవేనా?

ప. (విసుక్కుంది కోపం వొచ్చి ది) మీరేం వాళ్ళకి సర్టిఫికెట్ యివ్వక్కర్లేదు.

భగ. ఎంతమాటన్నారమ్మా! సర్టి కెట్లిచ్చేందుకు నేనెంతటివాడిన్లేండి. ఏదో మిత్రు , వాడు ముచ్చటకొద్దీ ప్రయోగిస్తున్న డైలాగు నడానికి యింపుగావుంది గదాని చొరవకొద్దీ అడిగేస తే ఇతరత్రా మరే ఉద్దేశం తోనూకాదు.

సీతా. అవున్రా నువ్వు వైజాగ్‌నుంచి కాకినాడ ఎప్పుడొచ్చావ్

భగ. ఆర్నెల్లక్రితం. ట్రాన్స్‌ఫరైవొచ్చేను. నాలుగు నెలలపాటు నేను కాకినాడలో సుఖంగా వున్నాన్రా. కానీ, రెండు నెలలక్రితం - సరిగ్గా రెండు నెలలక్రితం...

సీతా. ఏమైంది? ఏది జరిగిం ీరా!

భగ. వెధవ బతుక్కేం జరుగుతే ఏవిట్లేరా! అమ్మా పద్మావతమ్మగారూ - మా వాడికి బొత్తిగా కనీస మర్యాద లేవిటో తెలీదు. నే నొచ్చింత సేపైనా "కూచోరా భగవాన్లూ" అని అన్నాడ. అనడువాడు అలాటివాడు "కాఫీ పుచ్చుకుంటావుట్రా భగవాన్లూ" అని ఏం అడుగుతాడు చెప్పండి! మీరు ఏమీ అనుకోకపోతే. కొంచెం కాఫీ తీసుకొస్తారేమోనని అడగాలనుంది అడిగేశాండి.

(పద్మావతి సీతాపతి వేపు రుసరుసా చూచి వెళ్ళింది.)

భగ, ఎంత అనుకూల దాంపత్యంరా నా తండ్రీ! సుఖమంటే గుర్తుకొచ్చింది. కాకినాడలో నాలుగు నెలలు నేనెంత సుఖపడ్డానని. కానొరేయ్ సరిగ్గా రెండు నెలల క్రితం...

సీతా. సరిగ్గా రెండు నెలల క్రితం ఏం జరిగిందో చెప్పేవా సరే సరి. లేదూ, వొళ్ళు చీరేస్తాను. ఏవిటీ వెధవ సస్పెన్సూ మవ్వూను.

భగ. ఒరేయ్ నీకు శాంత తెలుసా! శాంతవంటి పిల్ల లేదోయ్ లేదోయ్! శాంత ఎంతందంగా వుంటుందను కున్నావ్! లోలోగినాబ్రిగడా - అర్ - లోలోజినా బ్రిజడా - నీ యిష్టం. నువ్వేమైనా అనుకో ఆ పిల్ల గూడా శాంత ముందు ఎందుకూ పనికి రాదనుకో. అసలు నీకు లోలోగినాబ్రిగడా తెలుసుట్రా!

సీతా. ఇంతకి నువ్వు చెప్పేది శాంత విషయమా లేక లోలాగినా బ్రిగడానా!

భగ; కలల్లో కనుపించే కథానాయికి శాంత. ఇప్పుడు చెప్పు నేనెవరి విషయం చెప్పేది!

సీతా. తంతానింక. సరిగ్గా రెండు నెలలక్రితం ఏం జరిగిందో చెప్పు చాలు!

భగ, ప్రేమ!

సీతా. ప్రేమేవిట్రా!

భగ. నీకు పెళ్ళయిపోయింది. ప్రేమంటే ఏవిటో నీకేం తెలుసు. నాలుగు నెలలుపాటు నేను ప్రేమతో ముచ్చటాడేను: ప్రేమకి నేను బాగానచ్చేను. నాకు ప్రేమ ప్రాణమైంది. నేను లేనిదే బతకలేనని ఖచ్చితంగా అన్నది ప్రేమ. ప్రేమ రెండు నెలలక్రితం వరకూ కాకినాడలోనేవుంది. అక్కడొక అఫీసులో ప్రేమ టైపిస్టు. ప్రేమ పేరు శాంతరా సీతాపతి! స్వీట్ శాంత. నా ఖర్మకొద్దీ రెండు నెలలక్రితం ప్రేమకి ఈ వూరు బదిలీ అయ్యింది. ఇప్పుడు ప్రేమ నాకు దూరంగా యిక్కడీ వూళ్ళోవుండి, నాకు సుఖం లేకుండ చేసింది. నేను పోగొట్టుకున్న సుఖాన్ని మళ్ళా జన్మలో దూరం చేసుకోకూడదని నేనీ వూరొచ్చేను. ఇక్కడికి ప్రేమని



పిలుస్తున్నాను. నువ్వా చైనులూ, మూర్తీ, కనకం, సుబ్బిగాడు, రాంబాబు, శ్యాంబాబు మొదలైన మన మిత్రులందరి సమక్షంలో ప్రేమతో నా పెళ్ళి విషయం మాటాడి, మాపెళ్ళికో సుముహూర్తాన్ని పెట్టుకుం టున్నారం. ఏన్నాళ్ళనుంచో ఎదురు చూస్తూన్న శుభ కార్యం ఇక్కడనీ యింట్లో జరుగబోతోంది. ఏదీ ఫో నెక్కడ.

(గబగబా భగవాన్లు ఆ యింట్లో ఫోన్ దగ్గరికి పరుగెత్తాడు. అతని ఏర్పాట్లన్నీ ఛిన్న సీతాపతి కుర్చీలో కూలబడ్డాడు)

భగ. (ఫోన్ డయల్ చేసేడు) హల్లో ప్రేమా ...సారీసార్ నేను ప్రేమనుకున్నాను. మళ్ళీ సారీసార్. అవును మీకు ప్రేమంటే ఎవరో తెలీదుగదూ ?... మిస్ శాంతకి కబురు చేయండి ప్లీజ్ ... యస్. మిస్ శాంత. నా పేరా ? భగవాన్లని చెప్పండి చాలు. [క్షణం విరామం. మౌత్‌పీస్ మూసి సీతాపతితో అన్నాడు) ఎవడీరాస్కెల్ ఫోనెత్తింది. మాటాడిందిచాలక నవ్వుతా డేవిట్రా ? ప్రేమంటే ఎవరన్నాడు. శాంత అన్నాను. ఇతేం జోకో నాకు తెలిసిందికాదు. కడుపు చెక్క లయ్యేలా నవ్వేడు రాస్కెల్... ఒరేయ్, ఒరేయ్ నా ప్రేమ ఫోన్‌దగ్గిరి కొస్తూంది. ఆ అడుగులచప్పుడు నాకు బాగా పరిచయం... అదిగదిగో వచ్చేసింది. వొచ్చేసింది. ఒరేయ్— నా ప్రేమ హల్లో అంటోందిరా, గోలచేయకు. రెండుక్షణాలు (ఫోన్‌లో) యస్ శాంతా నేనే భగవాన్లుని. అవున్నేనే. యేవిటూ ఆశ్చర్యం. వొచ్చేయ్... మా ఫ్రండ్ సీతాపతి గాడింట్లోవున్నాను వాడిల్లు తెలీదూ ... ఈస్టరన్ బేకరీ తెలుసుగా ... మరింకేం ? దాని తిన్నగా ఉన్న మేడ. మేడ తాలూకు డౌన్‌స్టేర్స్... వొస్తావుగా... థేంక్స్. ఫోన్ పెట్టేసేడు) ఒరేయ్ సీతాపతీ ! ప్రేమొస్తుందిరా నాప్రేమొస్తోంది. అల్లా తెల్ల మొహం పెట్టకు. నా స్నేహితుడివి, నా ఫ్రెండ్‌వి, స్టడీగా కూచో.

సీ. (చాలా మర్యాదగా పిలిచేడు) ఇల్లారారా... నా దగ్గిరికి రా. (భగవాన్లు వచ్చి నించున్నాడు) చేతిలో లగేజీయేమీ లేదుకనక హంగామాలేకుండా బుదిగా యిక్కడవుండి వెళ్లి పోతావనుకున్నాను. ఈ ప్రేమేవిటి ? ఫ్రండ్స్ సమక్షంలో అన్నావే, వాళ్ళెంతమంది? నీ పెళ్ళిముహూర్తం యిక్కడ యింటో నిర్ణయించడమేవిటి ? యేవిట్రా యిదంతా ? ఇది ఇల్లను కున్నావా ? క్లబ్బనుకున్నావా ? పద్మకి విషయం తెలిస్తే మనల్నిద్దర్నీ బయటికి గెంటుతుంది తెలుసా ?

భ. (చాలా రోషంగా అన్నాడు) హెూ... మా ప్రేమ హృదయాలని నొప్పించేందుకు మీకే అధికారమూ లేదు. జరిగేదంతా కళ్ళప్పగించి చూస్తుండండి. అంతే.

[సీతాపతి కుర్చీలోంచి అకస్మాత్తుగాలేచి, భగవాన్లుని కొట్టబోయేడు. కాని అంతలో పద్మ కాఫీ తీసుకు రావడంతో ఆ ప్రయత్నం విరమించి మాటలు నాన్చుతూ అన్నాడు]

సీ. మరేం లేదు పద్మా ! ఇప్పుడేం జరిగిందంటే వీడు మా భగవాన్లు... వీడు మా భగవాన్లు...

(పద్మ భగవాన్లకి కాఫీ అందించి అన్నది)

ప: అయన్నెన్ని తడవలు పరిచయం చేస్తారు ! మీకేమైనా మతి పోతోందా !

సీ. ఇంకా పోవడమేవిటి పద్మా... ఎప్పుడో పోయింది. (భగవాన్లువేపు మిర్రున చూసేడు సీతాపతి. తాపీగా తాగాడు)

ప. అసలు విషయమేవిటో చెప్పేరు కాదు !

సీ. అదే... ఏం జరిగిందంటే... ఒరేయ్ చెప్పవేంరా సన్నాసీ... ఒక్క గుక్కలో కాఫీ ముగించి ఏం జరిగిందో అంతా పూసగుచ్చినట్టు చెప్పు.

(భగవాన్లు కాఫీ తాగడం ముగించి అన్నాడు)

భ. ప్రేమా !

సీ. అదే పద్మ... ప్రేమ ! ప్రేమాని...

భ. ప్రేమా !

సీ. కాసేపట్లో ఇక్కడికి మా భగవాన్లు ప్రేమొస్తుందిట.

భ. ప్రేమా !

ప. ప్రేమ ! ప్రేమేవిటండి !

సీ. అబ్బబ్బ చెప్పరా వెధవా !

భ. ప్రేమా .

సీ. అదే వాడిప్రేమ. అంటే శాంత అనే ఆడపిల్ల వొస్తుందిట. ఇందాక ఫోన్‌లో మన ఇంటి అడ్రసిచ్చి, తిన్నగా యిక్కడి కొచ్చెయ్యమన్నాడు.

భ. ప్రేమా !

సీ. నోరు కుట్టేస్తా వెధవా ! ఇదంతా నా ప్రాణమ్మీదికి తెచ్చేవ్. మరేం లేదు పద్మా ! వీడు శాంత అనే అమ్మాయిని ప్రేమించేడు. వీళ్ళిద్దరూ అంటే శాంతానూ వీడూను పెళ్ళిచేసుకోబోతున్నారుట.

ప. ఇక్కడే ! ఈ ఇంటోనే !

భ. ప్రేమా !

పే. మళ్ళా ఆ పేరెత్తావంటే నిజంగానే తంతాను. నిన్ను కాదు పద్మా, భగవాన్లుగాడిన్లే. పెళ్ళిక్కడ జరగదు గావి...

శ. మరేవిఁటి జరుగుతుందిక్కడ!

భ. మీటింగు,

శ. మీటింగా!

భ. అవునండి. చిన్నసైజు మీటింగు... (శాంత రావడం చూచి అరిచేడు) అదుగోరా సీతాపతీ! నా ప్రేమొచ్చింది. రా శాంతా! రా!

(శాంత వచ్చి రావడంతోనే భగవాన్లుమీద విరుచుకపడింది)

శాంత. ఫోన్‌చేయడం తెలీకపోతే ఖబురంపాలి.

భ. నాకా ఫోన్‌చేయడం రాదు. ఏరా సీతాపతీ నువ్విది నమ్ముతావట్రా! ప్రేమరా! శాంత... నేను ఫోన్ చేసినే... ఆ అమ్మాయి.

పే. నమస్కారమండి.

శా. నమస్కారం. (భగవాన్లుతో వినుగ్గా అన్నది) ఫోన్‌లో ప్రేమా ప్రేమా అని పలవరిస్తే అంత ఆఫీసులో నాగతేం గాను?

భ. ఫోన్లోనే ఏవిఁటి శాంతా! నేనెక్కడైనా, ఏపరిస్థితుల్లోనైనా ప్రేమా అనే పలవరిస్తాను, అది నా హక్కు.

శా. సిగ్గు లేకపోతే సరి. హక్కుట, హక్కు. ఇంత తొందర మనుషుల్ని నేనెక్కడా చూళ్ళేదు, ఆఫీసు ఆఫీసంతా మనల్ని వేళాకోళం చేస్తున్నారు. తెలుసా?

భ. నవ్విపోదురుగాక మనకేటి సిగ్గు! వేళాకోళంట! కాల్చిపారేస్తాను వెధవల్ని.

శా. వూ... అదొక్కటే తెలుసు మీకు.

భ. ఇంకా చాలా తెలుసు నాకు.

శా. ఏం మనిషిరా దేవుడా? తను అర్థం చేసుకోరు. ఎవరైనా చెబితే వినరు. నా ఖర్మంకొద్దీ ప్రేమించేను.

భ. శాంతా మాటలు తిన్నగా రానివ్వు, నా కోపమొస్తే నేను మనిషినిగాను. ఏమైనా చేయగలను.

శా. ఏమైనా చేయగలరా?

భ. అహా! ఏమైనా చేయగలను.

(వాళ్ళు పోట్లాడుకుంటున్న సమయంలో సీతాపతీ, పద్మావతీ ఒకళ్ళ మొహాలొకళ్ళు చూచుకున్నారు. సీతాపతి పద్మచేతిని పుచ్చుకుని వీధివేపు వెళ్ళబోయేడు. ఒకడుగు నడిచేరుగూడాను...)


శాంత. ఏంచేస్తారు నన్ను కాల్చి చంపగలరా?

భగ. అహా... చంపి కాల్చనూగలను. ఏవిఁటనుకుంటున్నావో.

శా. అబ్బ... మీరింత దుర్మార్గులనుకోలేదు,

భగ. అబ్బ... నువ్వింత గయ్యాళివనుకోలేదు... ఒరేయ్ సీతాపతీ, ఎక్కడికిరా జారుకుంటున్నారు!

[ సీతాపతీ, పద్మా ఆగిపోతారు ]



సీతా. అవున్రా! వెళ్ళకేం చేస్తాం? ఇదిమా యిల్లు కాదురా భగవాన్లూ..మీది.

పద్మ. అందుకేగదా, వీధి గుమ్మం తెరిచివున్న సంగతి గూడా పట్టించుకోకుండా కేకలు వేసుకుంటున్నారు.

శా. అదేం మాఅక్కయ్యగారూ! మా టొచ్చిం తర్వాత వీధులూ, గుమ్మాలని పట్టించుకుంటే కోపం చల్లారేదెలా?

భగ. అవును శాంతా! నిజమే చెప్పేవ్. కమాన్ ... ఇంక నీ పాయింటేవిఁటో చెప్పు. నేను ఫోనులో ప్రేమాని పిలవడం తప్పంటావ్. అంతేగా?

శా. తప్పా? తప్పున్నరా? కావలిస్తే అక్కయ్యగార్ని అడగండి.

భగ. ఏవండీ వదినగారూ! చెప్పండి. నేను ప్రేమా అని పిలవడం తప్పా!

పద్మ. వుండండి వీధితలుపు వేసివొస్తాను.

[ పద్మ సీతాపతివేపు మిర్రున చూచి వీధితలుపు వేసేందుకు వెళ్ళింది. సీతాపతి తల వొంచుకు నించున్నాడు. ]

భగ. పోనీ, నువ్వైనా చెప్పరా సీతాపతీ! నే నన్నదాంట్లో తప్పేమైనా వుందా! తలొంచుకు నించుంటావేంరా! తలెత్తి ధీమాగా చెప్పు. నే నన్నది తప్పా!

సీతా. అబ్బ... కొంచెం గాలి పీల్చుకోనివ్వరా. అదరగొట్టేస్తున్నావ్.

[ పద్మ గబగబా వొచ్చి సీతాపతితో అన్నది ]

పద్మ. ఏవండోయ్... తలుపైతే వేసేనుగానీ, చైనులుగారితోపాటు మీ ఫ్రెండ్స్ పాతికమంది దాదాపు వీధిలో కనుపించేరు. వరస చూస్తూంటే అంతా ఈ యింటిని పావనం చేసేట్టున్నారు.

సీతా. చంపావురా భగవాన్లూ! ఎంతకష్టం తెచ్చిపెట్టావురా కొడకా!

భగ. ముందు తప్పేవరదో చెప్పు...

సీతా. మిమ్మల్ని ఈ ఇంటికి రానివ్వడంవుంది చూసేవ్ — అదే గొప్పతప్పురా బాబూ! లెంపలు వాయించుకుంటున్నాను. బుద్ధొచ్చింది.

[ చైనులు పర్సు దులుపుకుంటూ అక్కడికి వొచ్చేడు. వొచ్చి అందరి మొహాలూ సిరియస్‌గా చూస్తున్నాడు. సీతాపతి ఉలిక్కిపడి అడిగేడు. ]



సీతా. ఒరేయ్ చైనులూ! ఏవిట్రా ఈరాక? ఎల్లావొచ్చేవ్! ఎటునుంచి వొచ్చేవ్! వీధితలుపు వేసివుంది —

చైనులు. [కోపంగా అన్నాడు] బోడితలుపు. వీధితలుపు గొళ్ళెం పెట్టినంతమాత్రాన సరిపోతుందా సీతాపతీ! నాకు గోడలు దూకడం వొచ్చురా! అందుచేత, దొడ్డి వేపు గోడదూకి వొచ్చేను. ఓరేయ్ అబ్బాయ్ —మనం రావాలనుకుంటే, ఈ తలుపులూ, గొళ్ళలూ, గోడలూ— ఇవేం పనిచేయవు. తప్పుకో. మనవాళ్లంతా వీధివేపు నుంచున్నారు. తలుపుతీయ్.

సీతా. తలుపు తీయడవా! ఛస్తే తీయన్రా. ఆ వానర సైన్యానికి యిక్కడ చోటులేదు. వెళ్ళిపొండంతా. ఇక్కడెటు వంటి మీటింగులూ జరగడానికి వీల్లేదు. ఇది కొంపా కోనేరా! పొండి.

చైను. సరె, అలాగే. నేనేవెళ్ళి వీధితలుపు తీసి మనవాళ్ళకి విషయం చెబుతాను. చూస్తావుగా,

[వీధి గుమ్మంవేపు చైనులు వెడుతూండగా సీతాపతి అంటున్నాడు.]

సీతా. ఒరేయ్— ఒరేయ్ — తలుపు తెరవకురా చైనులూ! నాలుగు రోజుల క్రితవే కాపురం పెట్టేను. ఈ ఇల్లు వల్లకాడు చేయకండి. పద్మా — ఒసేవ్ — నన్ను క్షమించు. క్షమించవే పిల్లా — మా కోతమూకకంటే మీ కామాక్షమ్మ కుటుంబమే లక్షరెట్లు నయం. బుద్దొచ్చింది. మీ కామాక్షమ్మని ఎన్నెన్నో అన్నాను. నన్ను మన్నించు — అదుగో — వెధవ లొచ్చేస్తున్నారు. ఇంక నే నిప్పుడేం చేసేది! రండిరా, దేవుళ్ళూ — రండి — ఒక్కోడి డొక్కా చించిపారేస్తాను.

[సీతాపతి కుర్చీ ఎత్తీఎత్తడంతోటే తెఱ]

●●●


ఫోన్ : పి. పి. 7078

దీపావళి శుభాకాంక్షలతో

# కృష్ణా మెటల్ స్టోర్సు

(వెనుకటి రవి స్టోర్సు)

నమ్మకమైన స్టెయిన్‌లెస్ స్టీలు సామాను

లభించుచోటు

ప్రకాశంరోడ్డు - గవర్నరుపేట సెంటర్ విజయవాడ-2

కృష్ణా కో-ఆపరేటివ్ సెంట్రల్‌స్టోర్సు, రవి స్టోర్సులలో

20 సంగల అనుభవంతో మన్నికతో కూడిన

స్టెయిన్ లెస్ స్టీల్ పాత్రలు మార్కెట్‌లో అమ్మే ధరలకన్నా తక్కువకు గ్యారంటీగా యివ్వబడును. సులభ వాయిదా పద్ధతి ధరల మెదలుపెట్టినామని తెలుపుటకు సంతసించుచున్నాము.

రావి పిచ్చయ్య

ప్రొప్రయిటరు.